క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలోని 33/11కేవీ ఎఫ్‌సీఐ సబ్ స్టేషన్ నుంచి వచ్చే 11 కేవీ హనుమాన్‌పేట ఫీడర్ కింద రోడ్డు విస్తరణ పనులు నడుస్తున్నందున మంగళవారం ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని వన్ టౌన్ ఏఈ ఎన్. రవీందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ పరిధిలో గల బజాజ్ ఎలక్ట్రానిక్ కాంప్లెక్స్, కాకతీయ స్కూల్ బజారు, వర్షిత హాస్పటల్ బజారు, మధు ఆస్పత్రి నుంచి నుంచి జనతా బుక్ స్టాల్ వరకు సప్లయ్‌ను పూర్తిగా నిలుపుదల చేస్తున్నామని, ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గుర్తించి విద్యుత్ అధికారులకు సహకరించాలని కోరారు.

టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మిర్యాలగూడ : ఇటీవల పట్టణంలో నిర్వహించిన అల్లం కిరణ్ టాలెంట్ టెస్ట్‌లో పట్టణంలోని బకల్‌వాడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటి పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ కరుణాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించి మాట్లాడారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి ప్రతిఏటా అల్లం కిరణ్ మెమోరియల్ టాలెంట్ టెస్ట్ వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తలకోల శ్రీనివాస్, కస్తూరి ప్రభాకర్, ఉదయరాజు, దయాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, పీడీ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

‘చలో హైదరాబాద్’ను జయప్రదం చేయండి


ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న దయానంద్

మిర్యాలగూడ : పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 17న చేపట్టనున్న ‘చలో హైదరాబాద్’ కార్యక్రమానికి కార్మికులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ బైరం దయానంద్ అన్నారు. సోమవారం దామరచర్ల మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన వినతిపత్రం అందజేసి మాట్లాడారు. మండలంలోని గ్రామపంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని ప్రభుత్వం అమలు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో వాడపల్లి శ్రీరాములు, ఎండీ జహీర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే


రేగులగడ్డలో సర్వే చేస్తున్న అధికారులు

త్రిపురారం : నిడమనూరు, త్రిపురారం మండలాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే సోమవారం ముమ్మరంగా కొనసాగింది. ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న పేదల ఇంటికి పంచాయతీ కార్యదర్శులు వెళ్లి వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నారు. అయితే పలు గ్రామాల్లోని ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వివరాలు చూపించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇంటి పట్టా పత్రాలు సైతం అడుగుతుండడంతో అయోమయానికి గురవుతున్నారు. ఆన్‌లైన్‌లో చూపించని వారి వివరాలను సైతం నమోదు చేయాలని ఆయా గ్రామాల్లోని ప్రజలు కోరుతున్నారు. ఎంపీడీఓలు, ఎంపీఓలు సర్వే పనితీరును పరిశీలిస్తున్నారు.

నీలగిరి వాసులకు జాతీయ అవార్డులు


అవార్డు అందుకుంటున్న చింతల యాదగిరి

రామగిరి(నల్లగొండ): వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న నీలగిరి వాసులకు జాతీయ అవార్డులు దక్కాయి. పట్టణానికి చెందిన చిత్రకారుడు కొండేటి నివాస్‌కు జాతీయ కళారత్న, చింతల యాదగిరికి జాతీయ సాహిత్య రత్న అవార్డును సోమవారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో బహుజన సాహిత్య అకాడమీ వారు అందజేశారు. ఆయా రంగాల్లో సేవలు అందించినందుకు గాను అవార్డులు ప్రదానం చేశారని తెలిపారు.

అలంకారప్రాయంగా మత్స్యబీజ క్షేత్రం

- నిలిచిన చేపపిల్లల ఉత్పత్తి
- అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిన కేంద్రం
- కొరవడిన మత్స్యశాఖ అధికారుల పర్యవేక్షణ
- చేపల మార్కెట్ ఏర్పాటు చేయాలని వేడుకోలు


డిండిలోని మత్స్యబీజక్షేత్రం


నిరుపయోగంగా మారిన నీటి హౌస్‌లు

డిండి : ఉమ్మడి నల్లగొండ–మహబూబ్‌నగర్ జిల్లాల సరిహద్దు ప్రాంతమైన డిండి ప్రాజెక్టు దిగువ ప్రాంతంలో 1951–52 సంవత్సర కాలంలో మత్స్యబీజక్షేత్రాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి కొన్నేళ్ల వరకు ప్రాజెక్టు కాలువల ద్వారా వచ్చేనీటితో మత్స్యబీజ క్షేత్రంలో చేపపిల్లల ఉత్పత్తి జరిగింది. కానీ దాదాపు 15ఏళ్ల నుంచి మత్స్యబీజ క్షేత్రం పూర్తిస్థాయిలో చేప పిల్లల ఉత్పత్తి నోచుకోవడం లేదు. దీంతో చేపపిల్లలు పెంచే కొన్ని హౌస్‌లలో గడ్డి పెరుగుతూ వాటికి పగుళ్లు ఏర్పడ్డాయి. అంతేగాకుండా మత్స్యబీజ క్షేత్రానికి ఎలాంటి ప్రహరీ లేకపోవడం, ఇటు వైపు అధికారుల పర్యవేక్షణ పూర్తిగా తగ్గడంతో హైవే రోడ్డు మార్గ మధ్యలో ఉండటంతో ఇదే అదునుగా చేసుకున్న కొంతమంది వ్యక్తులు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మారింది. గత 3ఏళ్ల నుంచి వరుసగా ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండినా మత్స్యబీజ క్షేత్రంలో ఎలాంటి చేప పిల్లల ఉత్పత్తి జరగడం లేదని మత్స్యకారులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఇప్పటికైన సంబంధితాధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి మత్స్యబీజ క్షేత్రాన్ని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకరావాలని మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నారు.

మార్కెట్ లేకపోవడంతో..

డిండి ప్రాజెక్టుపై మండల కేంద్రంతోపాటు పరిసర గ్రామాల్లోని దాదాపు 500మంది మత్స్యకారులు చేపల వేటను జీవనోపాధిగా చేసుకొని బతుకుతున్నారు. మూడేళ్ల నుంచి వరుసగా ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో నీరు ఉండటంతో ప్రభుత్వమే ఉచితంగా చేపల పిల్లలను వదులుతుంది. మత్స్యకారులకు స్థానికంగా చేపల వేట దొరుతుండటంతో ఇతర ప్రాంతాలకు వెళ్లే వలస భాద తప్పినప్పటికీ చేపలవేటన అనంతరం చేపలు అమ్ముకునేందుకు మండల కేంద్రంలో చేపల మార్కెంట్ లేకపోవడంతో మత్స్యకారులు ఇబ్బందులకు గురవుతున్నారు. పలుమార్లు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని మత్స్యకారులు వాపోతున్నారు.

చేపల మార్కెట్ ఏర్పాటు చేయాలి



మూడేళ్ల నుంచి ప్రతి ఏటా వర్షాలు సమృద్ధిగా కురిసి డిండి ప్రాజెక్టు నిండటంతో చేపలు సమృద్ధిగా దొరకినప్పటికీ వాటిని విక్రయించడానికి మార్కెట్ స్థలం లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నాం. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధితాధికారులు స్పందించాలి.

– తవిటి సైదులు, మత్స్యకారుడు, డిండి

వినియోగంలోకి తేవాలి



మండల కేంద్రంలో నిరుపయోగంగా మారిన మత్స్యబీజక్షేత్రాన్ని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలి. స్థానికంగానే చేపల సీడ్ అందుబాటులో ఉంటే గ్రామాల్లోని ని చెరువులు, కుంటలలో చేపపిల్లలను వదిలేందుకు సౌకర్యంగా ఉంటుంది.

– మేకల కాశన్న, మత్స్య సొసైటీ చైర్మన్, డిండి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

డిండి ప్రాజెక్టు దిగువ ప్రాంతంలో నున్న మత్స్యబీజక్షేత్రానికి మరమ్మతులు చేపట్టి పూర్తిస్థాయిలో చేప పిల్లలను పెంచేందుకుగాను అవసరమైన నిధులు మంజూరు చేయాలని ఇప్పటికే జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– మారయ్య, ఎఫ్‌డీఓ

ప్రశాంతంగా ముగిసిన గ్రూప్–2 పరీక్షలు


మిర్యాలగూడ : పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్

మిర్యాలగూడ : మిర్యాలగూడ పట్టణం, మండలంలోని 28పరీక్షా కేంద్రాల్లో గ్రూప్–2 పరీక్షలు రెండో రోజు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. పేపర్–3, 4 పరీక్షలకు గాను 7941మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 3010 మంది హాజరై 4931 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. పలు పరీక్షా కేంద్రాలను సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ ఆకస్మింగా తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట తహసీల్దార్ హరిబాబు, రీజినల్ కోఆర్డినేటర్ వెంకటరమణ, రూట్ ఆఫీసర్లు ఎంఈఓ బాలునాయక్, డి.ధర్మానాయక్, కొర్ర కృష్ణకాంత్‌నాయక్, శివకుమార్, జాయింట్ రూట్ ఆఫీసర్లు సీఐ నాగరాజు, ఎస్ఐ శోభన్‌బాబు, వీరశేఖర్, సుధీర్, నరేష్, శేఖర్, అసిస్టెంట్ కోఆర్డినేటర్ నాగరాజు, ఫ్లయింగ్ స్క్వాడ్ జవహర్‌లాల్, శ్రీనివాస్, పోలీసు పాల్గొన్నారు.

గ్రూప్–2 అభ్యర్థులకు భోజనం ఏర్పాటు

మిర్యాలగూడ టౌన్ : గ్రూప్–2 పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు పట్టణ శివారులో రీయాన్ కళాశాల వద్ద అభ్యర్థులకు అల్ మదీనా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా భోజనం వసతి ఏర్పాటు చేశారు. శ్రీనివాస్‌నగర్ పరీక్ష కేంద్రం వద్ద ఫాతిమ ఎన్విరాన్మెంట్ డెవలప్ మెంటు సొసైటీ అధ్యక్షులు ఫర్వేజ్ ఆధ్వర్యంలో అభ్యర్థులు భోజన వసతి కల్పించారు.

భవన నిర్మాణానికి దాతలు ముందుకు రావాలి


రెండో బ్లాక్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న సంఘం అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి

మిర్యాలగూడ టౌన్ : రెడ్డి సంక్షేమ భవన నిర్మాణానికి దాతలు మరింత సహాయ సహకారాలు అందించాలని మిర్యాలగూడ రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు అనుముల మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక రెడ్డి సంక్షేమ సంఘం భవనంలో రెండవ బ్లాక్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు చాలా మంది దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చినందునా ఫస్ట్ బ్లాక్ నిర్మాణ పనులను చేపట్టినట్లు తెలిపారు. ఈ నిర్మాణ పనులు పూర్తయితే రైతులు ఆధునిక వ్యవసాయంపై ప్రత్యేక శిక్షణ తరగతులను కూడా నిర్వహించుకోవచ్చన్నారు. మహిళలకు వివిధ రకాల ఉపాధి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కంచర్ల అనంతరెడ్డి, నూకల హన్మంతరెడ్డి, చెన్నారెడ్డి, మాన్యం బుచ్చిరెడ్డి, మల్లారెడ్డి, నామిరెడ్డి నరేందర్‌రెడ్డి, ఎర్రమాద వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా ప్రతిభను వెలికితీసేందుకే ‘సీఎం కప్’


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు

మిర్యాలగూడ టౌన్ : పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మట్టిలో మాణిక్యంలాంటి క్రీడాకారులను వెలికి తీసేందుకు సీఎం కప్ నిర్వహిస్తున్నట్లు మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు అన్నారు. సోమవారం స్థానిక ఎన్ఎస్‌పీ క్యాంపులో జిల్లా యువజన క్రీడల విభాగం అధికారి నర్సిరెడ్డి ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా స్థాయి బాలబాలికల క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ నెల 18వ తేదీ నుంచి 21వ తేదీలో వరకు గచ్చిబౌలిలో జరగనున్న బేస్‌బాల్ రాష్ట్ర స్థాయి సీఎం కప్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను మిర్యాలగూడ డీఎస్పీ పరిచయం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో పట్టుదల, కృషి ఉంటే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలుగుతారన్నారు. జిల్లా నుంచి ఏ విధంగా జట్టుకు ఎంపికయ్యారో అదే రీతిలో రాష్ట్ర స్థాయిలో కూడా ప్రతిభను కనబర్చిన మంచి గుర్తింపును తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో బేస్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి చిర్ర మల్లేష్ యాదవ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నూకల వేణుగోపాల్ రెడ్డి, బాక్సింగ్ జిల్లా అసోసియేషన్ కార్యదర్శి రవీందర్ గౌడ్, కౌన్సిలర్ జానీ, దామరచర్ల మాజీ సర్పంచ్ కిరణ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

సత్యనారాయణకు వాస్తు రత్న ఎక్స్‌లెన్స్ అవార్డు

మిర్యాలగూడ టౌన్ : పట్టణానికి చెందిన ప్రముఖ వాస్తు సిద్ధాంతి మామిడి సత్యనారాయణ వాస్తు రత్న ఎక్స్‌లెన్స్ అవార్డు అందుకున్నారు. సోమవారం వారణాసిలో నిర్వహించిన ఇంటర్నేషనల్ వేదిక్ అస్ట్రాలజీ ఈ కాన్ఫరెన్స్‌లో ఆయనకు ఈ అవార్డు అందజేశారు.


అవార్డు అందుకుంటున్న సత్యనారాయణ

28నుంచి ఏపీజీవీబీ సేవలకు అంతరాయం


మాట్లాడుతున్న బ్యాంక్ మేనేజర్ ఉపేంద్రబాబు

మిర్యాలగూడ : దామరచర్ల మండల కేంద్రంలోని ఏపీజీవీబీ బ్యాంకులో ఈనెల 28 నుంచి 31వ తేదీ వరకు బ్యాంక్ సేవలకు అంతరాయం కలుగుతుందని మేనేజర్ ఉపేంద్రబాబు తెలిపారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ శాఖలన్ని తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంక్‌లో విలీనం చేస్తున్నందున బ్యాంక్ సేవలకు అంతరాయం ఏర్పాడుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సేవల విభాగం ఆదేశాల మేరకు ఈ బ్యాంకుల విలీన ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఖాతాదారుల డిపాజిట్లు, సేవింగ్స్ ఖాతాలు, లోన్లకు ఎలాంటి హాని ఉండదన్నారు. ఏపీజీవీబీ బ్యాంకుకు సంబంధించి బ్యాంకింగ్ సేవలు, మొబైల్ బ్యాంకింగ్, యూపీఐ సేవలు పనిచేయవన్నారు. అత్యవసరం ఉన్న ఖాతాదారులు ఈనెల 27 వరకు బ్యాంక్ సేవలను వినియోగించుకోవాలన్నారు. ఎలాంటి సందేహాలు ఉన్నా బ్యాంకుకు వచ్చి సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్లు సునీల్‌కుమార్, కార్తీక్ పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్రం


సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంసీపీఐయూ నాయకులు

మిర్యాలగూడ : కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తూ కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తుందని ఎంసీపీఐయు రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వస్కుల మట్టయ్య అన్నారు. సోమవారం సబ్ కలెక్టర్‌నారాయణ్‌అమిత్‌కు ఆయన వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ కార్మికుల చట్టాలను కేంద్రం కాలరాస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ధీరావత్ మోహన్‌నాయక్, వసుకుల సైదమ్మ, పోతుగంటి కాశీ, కిరణ్, భరత్, వీరయ్య, రవీందర్, మల్లేష్ పాల్గొన్నారు.

శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకోవాలి


మాట్లాడుతున్న యాదగిరిరావు

చింతపల్లి : భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల ఉత్సవాలను గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించుకోవాలని మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు పిలుపునిచ్చారు. సోమవారం మండల పరిధిలోని పీకే మల్లేపల్లిలో గ్రామశాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పతాకాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. భారత కమ్యూనిస్టు పార్టీ పేద ప్రజల పక్షాన అనేక ఉద్యమాలు నిర్వహిస్తుందన్నారు. వందేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 30న నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించే బహిరంగ సభకు నల్లగొండ జిల్లా నలుమూలల నుంచి కార్యకర్తలు ప్రజా సంఘాల నాయకులు కార్మికులు, మహిళలు, విద్యార్థులు వేల సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి పోలే వెంకటయ్య, అంజల్ రావు, బుచ్చయ్య, శేఖరాచారి, లక్ష్మయ్య, జంగయ్య పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లు ఆలోచన శక్తిని పెంపొందిస్తాయి


విద్యార్థులను అభినందించి మాట్లాడుతున్న ఎంఈఓ బాలునాయక్

మిర్యాలగూడ : టాలెంట్ టెస్ట్‌లు విద్యార్థుల్లో ఆలోచన శక్తిని పెంపొందిస్తాయని ఎంఈఓ లావూరి బాలునాయక్ అన్నారు. సోమవారం తెలంగాణ మాథ్స్ ఫోరం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి గణిత ప్రతిభ పోటీ పరీక్షలు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గణితంపై విద్యార్థులు ఆసక్తిని పెంపొందించుకోని రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరచాలన్నారు. అనంతరం ప్రతిభ చాటిన విద్యార్థులకు దశరథ మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెమెంటో, ప్రశంసాపత్రంతో పాటు నగదు ప్రోత్సాహకాలు అందించారు. పత్రంతోపాటు నగదు ప్రోత్సాహకాలు ఈ కార్యక్రమంలో హెచ్ఎం డి.ధర్మానాయక్, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కృష్ణకాంత్‌నాయక్, టీఎంఎఫ్ డివిజన్ బాధ్యులు సైదిరెడ్డి, శ్రీశైలం, తావుర్యా స్వామి, జ్యోతి, సైదులు, బాలు ఉన్నారు.


కొండమల్లేపల్లి : విద్యార్థులకు మెమొంటోలు అందజేస్తున్న ఎంఈఓ

రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చాలి

కొండమల్లేపల్లి : విద్యార్థులు గణితంపై ఆసక్తి పెంచుకొని రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చాలని కొండమల్లేపల్లి ఎంఈఓ నాగేశ్వరరావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ మ్యాథ్స్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి గణిత ప్రతిభా పోటీ పరీక్షల సందర్భాంగా మాట్లాడారు. విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్యసాధనకు నిరంతరం కృషిచేయాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు రూ.500, ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థులకు రూ.300, తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థులకు రూ.200చొప్పున నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శ్రీనివాసులు, జనార్దన్‌రెడ్డి, సరస్వతి, నాగార్జున, వసుంధర, సువర్ణ, నసీరుద్దీన్, బాలాజీ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి సీఎం కప్‌కు విద్యార్థులు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

మిర్యాలగూడ టౌన్ : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 12, 13వ తేదీల్లో నిర్వహించిన జిల్లా స్థాయి సీఎం కప్‌కు ఆదిత్య విద్యార్థులు ప్రతిభ కనబర్చి ఎంపికై నట్లు పాఠశాల కరస్పాండెంట్ మారుతి అమరేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఎంపికైన విద్యార్థులను ఆయన అభినందించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించిన వారిలో పాఠశాల కరస్పాండెంట్ మారుతీ అమరేందర్‌రెడ్డి, ప్రిన్సిపల్ నాగరాజు, వైస్ ప్రిన్సిపల్ కట్టా అనితలు ఉన్నారు.

ఘనంగా అయ్యప్ప మండల మహాపూజ


మండల పూజలో భజన పాటలు పాడుతున్న అయ్యప్పమాలధారులు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని అశోక్‌నగర్‌లో అయ్యప్పస్వామి దేవాలయంలో సోమవారం అయ్యప్పస్వామి మహా మండల పూజను రంగ రంగ వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠాచార్య పీసపాటి లక్ష్మిగణపతి శాస్త్రీ వేద మంత్రోత్సవాల మధ్య అయ్యప్పస్వామి పూజలను నిర్వహించారు. ఈ పూజా మహోత్సవానికి వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన మాలధారులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పూజ మహోత్సవం అనంతరం స్వాములకు అన్నదానం నిర్వహించారు. ముందుగా స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అయ్యప్ప దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన తరువాత గుడిపాటి నవీన్ నివాసంలో కళాశాభిషేకానికి కార్యక్రమానికి హాజరై పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ శాశ్వత అధ్యక్షులు వెంకటేశ్వర్‌రావు, ఆలయ ప్రధాన అర్చకులు సురేష్‌శర్మ, అయ్యప్ప టెంపులు గురుస్వాములు నాయుడు, నాగరాజు, గురువారెడ్డి, పులిమేడు ఆశ్రమం గురుస్వాములు శేఖర్‌రెడ్డి, జానకిరాంరెడ్డి, కిశోర్‌రెడ్డి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.


మిర్యాలగూడ టౌన్ : మండల పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల నిరసన


కంపాసాగర్ మెడల్ స్కూల్‌లో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

త్రిపురారం : టీఎస్ మోడల్ స్కూల్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల వారి న్యాయమైన సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ త్రిపురారం మండలంలోని కంపాసాగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని టీఎస్ మోడల్ స్కూల్‌లో సోమవారం మూడో రోజు భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పీఎంటీఏ టీఎస్ నేతలు మాట్లాడుతూ.. మోడల్ స్కూళ్లను విద్యాశాఖలో విలీనం చేసి 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలన్నారు. ఒకే నోటిఫికేషన్ ద్వారా ఎన్నికకాబడి తగిన మెరిట్ అర్హత ఉన్నప్పటికీ అడ్మినిస్ట్రేటివ్ కారాణాలతో దశల వారిగా నియామకాలు చేపట్టడంతో జరిగిన నష్టాన్ని నోడల్ సర్వీస్ కల్పించి న్యాయం చేయాలన్నారు. పీజీటీలను జేఎల్ అప్‌గ్రేడేషన్ చేసి, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మల్లికంటి వెంకటేశ్వర్లు ఉన్నారు.

చదువుతో ఏదైనా సాధించొచ్చు


కేజీబీవీలో విద్యార్థినులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న లింగారెడ్డి

పెద్దవూర : డబ్బు, పరపతితో సాధించలేనిది చదువుతో సాధించవచ్చునని జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి అన్నారు. ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి తన సొంత ఖర్చులతో అందించిన దుప్పట్లను సోమవారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఏఎంసీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి విద్యార్థినులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చదువుకు పేదరికం అడ్డుకాదని, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని అనుకున్న లక్ష్యాలను సాధించాలని సూచించారు. చదువుతోనే గౌరవ మర్యాదలు, ఉన్నత పదవులు సాధిదంచవచ్చునని తెలిపారు. ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి తన తండ్రి మాజీ మంత్రి జానారెడ్డిని స్ఫూర్తిగా తీసుకుని నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుండి నడిపిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గుంటుక వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పబ్బు యాదగిరి, చామల సువర్ణ, ఉంగరాల శ్రీను, ఎస్ఓ జ్యోత్స్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం


పూజలు నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని హౌసింగ్‌బోర్డు లోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం, రెడ్డికాలనీలో గల శ్రీకొదండ రామాలయంలో ధనుర్మాస ఉత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభ మయ్యాయి. హౌజింగ్ బోర్డులో ముందుగా దేవాలయం రజతోత్సవం నిర్వహించారు. మొదటగా తిరుప్పావై పాశురాన్ని పఠించారు. ఆలయ ప్రధాన అర్చకులు రాఘవాచార్యులు వేదమంత్రోత్సవాల నడుమ ఉత్సవాలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సూదిరెడ్డి వెంకటరెడ్డి, ఉపాధ్యక్షులు వేణుగోపాల్‌రావు, నాగలక్ష్మి, ప్రధాన కార్యదర్శి రంగయ్య, సహాయ కార్యదర్శులు శ్రీనివాస్, రమాదేవి, కార్యనిర్వాహక కార్యదర్శి సత్యం, శ్రీనివాస్, శ్రీరామ్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రోశమ్మ, సువర్ణ, లక్ష్మి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

‘డబుల్’ ఇళ్లు స్వాధీనపర్చాలని ఆందోళన

నల్లగొండ టౌన్: నల్లగొండలో లాటరీ పద్ధతిన ఎంపిక చేసిన డబుల్ బెడ్ రూం ఇళ్లను లబ్ధిదారులకు వెంటనే స్వాధీనపర్చాలని సీపీఎం పట్టణ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో లబ్ధిదారులతో కలిసి సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టిన ఆందోళనలో ఆయన మాట్లాడారు. లాటరీ పద్ధతిలో 552 లబ్ధిదారులను ఎంపిక చేశారని, కానీ వారికి ఇప్పటివరకు ఇళ్లు స్వాధీనపర్చలేదని తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎండీ సలీం, పద్మ, నరసింహ, అశోక్ రెడ్డి, నరసింహ, రవీందర్, మధుసూదన్‌రెడ్డి, నాగరాజు, లబ్ధిదారులు ఎస్కే లతీఫ్, లక్ష్మమ్మ, గుండ్ల స్వరూప, యాదమ్మ, పాల్గొన్నారు.